క్లుప్తంగా

ఉత్తమ వైద్యాధికారిగా రంగంనాయుడు



కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ రంగంనాయుడు

కాళ్ల: ఉత్తమ వైద్యాధికారిగా కాళ్ళ మండల వైద్యాధికారి డాక్టర్ చినిమిల్లి రంగంనాయుడు అవార్డు అందుకున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రతినిధులు గురువారం తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నాగరాణి కార్యాలయంలో జరిగిన సభలో జిల్లా ఉత్తమ వైద్యాధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, రూ.7000/- చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు పొందిన రంగంనాయుడుకి స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సుబ్బరాజును పరామర్శించిన చినమిల్లి



సుబ్బరాజును పరామర్శిస్తున్న వెంకటరాయుడు

భీమవరం: పితృవియోగంతో బాధపడుతున్న అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజును భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు గురువారం పరామర్శించారు. సుబ్బరాజు తండ్రి వెంకటరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు తదితరులున్నారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో గురువారం దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. భీమవరంలోని చీడే సత్యనారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ కాశీ విశాలాక్షి ఆర్థిక సహకారంతో గ్రామ సర్పంచ్ ముత్యాల అనురాధ ఐదు సైకిళ్లను పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

వేగంగా వంతెన నిర్మాణ పనులు



పెదఅమీరంలో వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ సోమేశ్వరావు

కాళ్ల: మండలంలోని పెదఅమీరంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని సర్పంచ్ డొక్కు సోమేశ్వరావు అన్నారు. గ్రామంలోని సత్రం ఎదురుగా పంచాయతీ నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న వంతెన పనులను గురువారం పరిశీలించి మాట్లాడారు. గతంలో ఈప్రాంతంలో తూములతో వంతెన ఉండేదని, దానిస్థానంలో శాశ్వత ప్రాతిపదికన కాంక్రీటు బ్రిడ్జ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో నిర్మించి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

మట్టి తోలకాలతో విద్యార్థుల అవస్థలు



మొగల్లు- గుత్తుల వారి పాలెం రోడ్డులో విద్యార్థుల ఇబ్బందులు

పాలకోడేరు: నిబంధనలకు విరుద్ధంగా పాలకోడేరు మండలంలో భారీగా యథేచ్ఛగా ట్రాక్టర్లతో వ్యాపారులు మట్టిని తోలడంతో మట్టి గెడ్డలు రోడ్లపై పడటంతో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పలు రోడ్లన్నీ బురదమయమయ్యాయి. మొగల్లు గ్రామపంచాయతీ పరిధిలోని గుత్తుల వారి పాలెంలోని విద్యార్థులు చదువు నిమిత్తం మొగల్లు స్కూల్‌కి వస్తూంటారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గుత్తులవారిపాలెం నుంచి మొగల్లు వచ్చే రోడ్డులో మట్టి తోలకం వల్ల ఆ రోడ్డు అంతా బురదమయం కావడంతో విద్యార్థులు పరిస్థితి వర్ణనాతీతం. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్డు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.

చంద్రబాబుది దగాకోరు పాలన

- కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలంతా మోసపోయారు
- ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్ నరసింహరాజు



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాళ్ల: సీఎం చంద్రబాబు పాలన దగాకోరు పాలన అని, కూటమి హామీలకు రాష్ట్ర ప్రజలంతా మోసపోయారని ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం పెద అమీరం నిర్మలాదేవి ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి ఇంటింటికీ హామీల బాండ్లను పంపించి అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా ప్రజలను మోసం చేశారన్నారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఏం ఒరగబెట్టారని తొలి అడుగంటూ ప్రజల్లోకి వెళ్తున్నారంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఇచ్చిన హామీలను ప్రజలకు అమలుచేసే విధంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సూపర్‌సిక్స్ అన్నావు.. బాబు ష్యూరిటీ అన్నావు, కానీ ఏడాది పాలనలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే విధంగా చంద్రబాబు ప్రజల్ని నమ్మించి అడ్డంగా మోసం చేశాడని విమర్శించారు. ప్రతి నెలా ఏదోక సంక్షేమాన్ని అందించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలుచుకున్నారని, ప్రజల్ని ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం వ్యతిరేకత బాగా పెరిగిందని స్పష్టం చేశారు. ప్రజల కష్ట సుఖాల్లో అండగా ఉంటూ రాబోయే రోజుల్లో 175కి 175 వైఎస్సార్‌సీపీ గెలుచుకోవాలని ధీమా వక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, ముదునూరి మురళీకృష్ణ రాజు, గూడూరి ఉమాబాల, చినమిల్లి వెంకట రాయుడులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతపాటి శ్రీనివాసరాజు,మేడిది జాన్సన్, పెండ్ర వీరన్న, నంద్యాల సీతారామయ్య, కొండేటి శివకుమార్, ఉండి ఆకుకూడు జడ్పిటిసిలు రణస్థుల మహంకాళి, వేగేశ్న వెంకటరాజు,ఎంపీపీ, ఇందుకూరి శ్రీహరిరాజు, గులిపల్లి అచ్చారావు, గలవేలి ధనుంజయ్,వేగేశ్న జయ రామ కృష్ణంరాజు,సాగిరాజు హరివర్మ, గన్నెశ్న రాంబాబు, గుర్రం బెన్హర్ నియోజకవర్గస్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువులో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం 11 కేవీ లైన్లపై ఆర్‌డీఎస్‌ఎస్ పనులు, చెట్లు, కొమ్మలు తొలగించుటలో భాగంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. పెదగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా లైన్లకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అదేవిధంగా గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరంలో...

భీమవరం: పట్టణంలో డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ వెనుక పంటకాలువగట్టు రోడ్డు పనుల నిమిత్తము 11 కెవి లైన్ల మార్పిడి కొరకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు రామ్ లక్ష్మణ్ నగర్, లెక్చరర్ స్ట్రీట్, గొల్లవానితిప్ప రోడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ) ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: మండలంలోని కోలమూరు, యండగండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎన్ వెంకటేశ్వరరావు ఓప్రకటనలో తెలిపారు.కోలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో కోలమూరు, పాములపర్రు, ఉప్పులూరు, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడు, గ్రామాలతో పాటు పరిశ్రమలు, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. అలాగే యండగండి సబ్‌స్టేషన్ పరిధిలో యండగండి, ఉణుదుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

24న దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

కాళ్ల: నియోజకవర్గంలోని కాళ్ళ, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాలైన కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి సాధనాలు మొదలైన పరికరాలను అందజేసేందుకు ఈనెల 24న ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు కాళ్ళ ఎంపీడీఓ జి.స్వాతి గురువారం తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన ఉండి హైస్కూల్లో అర్హత, నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు తమ ఆధార్, సదరం సర్టిఫికేట్, రేషన్ కార్డు, 2 ఫోటోలు తీసుకొని ఉదయం10 గంటలకు శిబిరానికి హాజరుకావాలని కోరారు.

జిల్లాలోని రహదారుల మరమ్మతులకు నిధుల విడుదల

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని రెండు ప్రధాన రహదారుల మరమ్మతులకు సంబంధించి రూ.6.15 కోట్లు, ఐదు రాష్ట్ర రహదారుల మరమ్మతులకు సంబంధించి రూ.14.50 కోట్లు నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వీటిలో జిల్లా ప్రధాన రహదాలకు సంబంధించి భీమవరం నియోజకవర్గంలో వాండ్రం - సీసలి రోడ్డు జీరో కిలోమీటర్ నుంచి 7.4 కిలోమీటర్ వరకు రెండు కిలోమీటర్లు పరిధికి రూ.2.65 కోట్లు, ఉరదాళ్లపాలెం టు దువ్వ రోడ్డు జీరో కిలోమీటర్ నుండి 1.3 కిలోమీటర్ వరకు, దువ్వ టు ఆరుళ్ల జీరో కిలోమీటర్ నుంచి 7.5 కిలోమీటర్ల వరకు మొత్తం 8.8 కిలోమీటర్ల పరిధికి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర రహదారులకు సంబంధించి తణుకు నియోజకవర్గంలో మార్టేరు - ప్రక్కిలంక రోడ్డు నాలుగో కిలోమీటర్ నుంచి ఆరో కిలోమీటర్ వరకు, 7.4 కిలోమీటర్ నుంచి 11.5 కిలోమీటర్ వరకు మొత్తం 5.90 కిలోమీటర్ల పరిధికి రూ.3 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నరసాపురం టు అశ్వరావుపేట రోడ్డు 59.1 కిలోమీటర్ నుంచి 62వ కిలోమీటర్ల వరకు 2.90 కిలోమీటర్ల పరిధికి రూ.2.50 కోట్లు, పాలకొల్లు నియోజకవర్గంలో పాలకొల్లు టు దొడ్డిపట్ల రోడ్డు జీరో కిలోమీటర్ నుంచి 11.6 కిలోమీటర్ వరకు మొత్తం11.60 కిలోమీటర్ల పరిధికి రూ.5 కోట్లు, ఆచంట నియోజకవర్గంలో పెనుమంట్ర టు వీరవాసరం రోడ్డు జీరో కిలోమీటర్ నుంచి 4.3 కిలోమీటర్ పరిధిలో మొత్తం 4.30 కిలోమీటర్లకు రూ.2.50 కోట్లు, పాలకొల్లు టు ఆచంట రోడ్డు 0.3 కిలోమీటర్ నుండి 5.6 కిలోమీటర్ వరకు మొత్తం 1.50 కిలోమీటర్ల పరిధికి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి రోడ్డు మరమ్మతులను చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



కోలమూరులో విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు అందజేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించాలంటే విద్యను ప్రోత్సహించి విద్యార్థులకు సహకరించాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, పెన్మత్స రంగప్రసాదరాజు అన్నారు. గురువారం ఇతర గ్రామాల నుంచి చదువుల కోసం కోలమూరు వస్తున్న 54 మంది విద్యార్థులకు గ్రామ పెద్దలు గండ్రాజు రాజేష్‌వర్మ, పాము రవికుమార్ సహకారంతో ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్‌లను అందజేసారు.ఈ సందర్భంగా దాత రవికుమార్ మాట్లాడుతూ సమాజంలో విద్య, వైద్యం రెండూ అతి కీలకమైనవని వాటిని సమాజంలో నిరుపేదలకు అందించేలా మనమంతా సహకరించాలని అన్నారు.అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర బీఆర్ అంబేడ్కర్ సూచించినట్లు ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదవుకుంటేనే వారి తరువాతి తరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. న్యాయశాస్త్రం చదివేందుకు కూడా అనేకమంది విద్యార్థులు ముందుకు రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయభాస్కర్, లయన్స్‌క్లబ్ నాయకులు రుద్రరాజు నరసరాజు, కన్నెగంటి రూత్‌కళ, కూనపరాజు రామచంద్రరాజు, సత్తి బ్రహ్మారెడ్డి, గొట్టుముక్కల రాము, బీ హరనాథరాజు, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, పూసపాటి వెంకటరమణరాజు, విజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ సభ

- రప్ఫా రప్ఫా అంటూ కార్యకర్తలు, అభిమానుల కేరింతలు
- వక్తల ప్రసంగాలకు తప్పట్లు
- మిన్నంటిన ఉత్సాహం



బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీకి హాజరైన నాయకులు, కార్యకర్తలు అభిమానులు



మాట్లాడుతున్న ఆకివీడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంద్యాల

ఆకివీడు: ప్రజా వ్యతిరేక ప్రభుత్వం, చేసిన వాగ్దానాల్ని మరిచిన కూటమి ప్రభుత్వంపై ఎక్కుపెట్టిన బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం ఉండి నియోజకవర్గంలో విజయవంతంగా జరిగింది. సమావేశం ఆద్యంతం దద్దరిల్లిపోయింది. సభలో నాయకులు, ప్రజా ప్రతినిధుల ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తూ తప్పట్లు, ఈలలతో ఉత్సాహంగా, ఉత్తేజంగా సభ జరిగింది. చంద్రబాబు, పవన్ కల్యాణలపై విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో పలు సార్లు యువ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ కేకలు వేశారు. బాబు ష్యూరిటీ బాండ్‌ను స్క్రీన్‌పై చూపిస్తుండగా కొంత మంది మోసం, దగా కోరు ప్రభుత్వం అంటూ నినాదాలు చేశారు. ఉండి నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు ఇదే ఉత్సాహం, స్ఫూర్తితో మండలంలోనూ, గ్రామాల్లోనూ ప్రతి ఇంటికీ వెళ్లి బాబూ ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కరపత్రాల్ని పంచి, పథకాలు అందని విషయాన్ని గుర్తుచేసి, నిలదీయాలంటూ ప్రచారం చేయాలని పిలపునిచ్చారు.

బాధ్యతతో పనిచేయాలి

పదవులు పొందినవారు పార్టీకి కట్టుబడి అంకిత భావంతో పని చేయాలని సమావేశంలో ఆకివీడు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే జమిలి ఎన్నికల్లో మనమంతా కలిసి ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసి, అఖండ మెజార్టీతో పీవీఎల్.నర్సింహరాజును వచ్చే ఎన్నికల్లో గెలిపిద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గొర్రుముచ్చు సుందర కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, చేసిన వాగ్దానాల్ని అమలు పరచమన్నందుకు కక్ష కడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు మంతెన సునిల్ కుమార్‌వర్మ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ వంగా జ్యోత్స్న, అంబటి రమేష్, గుండ సుందర రామనాయుడు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, కౌన్సిలర్లు నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, గుండుగొలను సావిత్రి, ఎండీ. జక్కీ, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోటుపల్లి గంగాధర రావు, ఎస్కే. రసూల్ బీబీ, కేశిరెడ్డి మురళీ, జగ్గరోతు విజయ్ కుమార్, మోరా జ్యోతి, గాలి సామ్రాజ్యం, ఎస్కే.హుస్సేన్, జీ.ధనరాజు, కఠారి రాము, కేశవరావు, పాశం నర్సింహం, కేశిరెడ్డి దిలీప్, కొటికలపూడి అంజిబాబు, ఇందుకూరి నారాయణరాజు, చిగురుపాటి చిట్టిబాబు, భూపతిరాజు బుజ్జిరాజు, కొట్టు మాణిక్యాలరావు, కురెళ్ల పోలు, నానాజీ, చందన చిన్నా, పాగొల్లు రాజు, నాతిరెడ్డి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలి



అంతర్జాతీయ న్యాయ దినోత్సవంలో పాల్గొన్న వక్తలు

భీమవరం: చట్టాలపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. గురువారం భీమవరంలో శ్రీవిజ్ఞానవేదిక, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. న్యూటన్ మాట్లాడుతూ ఒక్క అమాయకుడికి కూడా అన్యాయం జరగకూడదన్న సూత్రము న్యాయ వ్యవస్థకు పునాది అని అన్నారు. మాజీ ఏపీపీ ఎస్ విజయ కుమార్, న్యాయవాది సీహెచ్ ప్రసాద్, కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విచారణ ప్రక్రియలో పారదర్శకత, సమర్థత, స్పష్టత తీర్పులో స్వచ్ఛతలు న్యాయ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతాయన్నారు. అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఏర్పాటుకు గుర్తింపు చర్యగా ప్రతిఏటా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మనం న్యాయాన్ని కాపాడితే న్యాయమే మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్ భోగేశ్వరరావు, యు శ్రీకాంత్, జీవి స్టీపెన్ బాబు, పి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం సొమ్ములను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లికి వందనం సొమ్ములను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి తల్లికి వందనం పథకంపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందన పథకం విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వం అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాలకు ప్రతి విద్యార్థికి 13,000 రూపాయలు చొప్పున బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. సంబంధిత సొమ్ము పాఠశాలల, కళాశాలల విద్యార్థుల ఫీజు చెల్లింపులకు మాత్రమే వినియోగించుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి తల్లికి వందనం పథకాన్ని సద్వినియోగం చేసుకొని వారిని ప్రయోజకులను చేకూర్చ వలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.డి.ఎం నాగేంద్ర ప్రసాద్, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని టౌన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ జి శ్రీనివాస్ అన్నారు. గురువారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన కల్పిస్తున్నారన్నారు. రైల్వే పోలీస్ స్టేషన్ సీఐ దస్తగిరి, ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల సంఘం చైర్మన్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి వ్యాపారి సహకరించాలని, ప్లాస్టిక్ నిషేధంపై మార్పులు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై పట్టణంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రఘురామయ్య, రమణ, కె కనకదుర్గ, వై రమణయ్య, నసీమా బేగం తదితరులు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాను నిరోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఇందిర

పాలకొల్లు సెంట్రల్: మనుషులు అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ప్రతి రోజూ ఎంతో మంది అమ్మాయిలు ఈ అక్రమ రవాణాకు గురవుతున్నారని సీడీపీవో సీహెచ్ ఇందిర అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారిచే అక్రమ రవాణాపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్ ఇందిర మాట్లాడుతూ మహిళలు, అమ్మాయిలు ఎక్కువగా అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారన్నారు. ప్రజ్వల కో-ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ ఈ అక్రమ రావాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వలు స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డా సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యాశాఖ, న్యాయశాఖల సమన్వయంతో ఇప్పటి వరకూ 29,200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించారన్నారు. సమస్య ఎదురైనపుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ అనిల్ కుమార్, చెన్నకేశవులు, సుధ, మల్లీశ్వరి, మంగ,అంగన్‌వాడి టీచర్స్ పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు మేలు

పెనుగొండ: రీసర్వేతో రైతుల భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. గురువారం సిద్ధాంతం పంచాయతీ వద్ద జరిగిన రీ సర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. ల్యాండ్ పార్సిల్ మ్యాప్ నంబర్ ఇద్దరు రైతులకు కలిపి ఒకటే ఉండడంతో సంక్షేమ పథకం అమలులో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రైతులు ఈ సమస్యల పరిష్కారానికి స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ గురువారం ఆకస్మిక పర్యటించారు. ముందుగా గ్రామంలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని యూపీ స్కూల్ ను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. తమ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడు లేరని పోస్టు భర్తీ చేయాలని గ్రామ ఉపసర్పంచ్ నడింపల్లి ప్రదీప్ రాజు ఆమెను కోరారు. అదేవిధంగా పాఠశాలకు మరొక అదనపు భవనం అవసరం ఉందని కోరారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ప్రస్తుతానికి తాత్కాలికంగా వారంలో రెండు మూడు రోజుల పాటు హిందీ ఉపాధ్యాయుడు వచ్చే విధంగా చేయాలని ఉన్నత అధికారులకు ఆదేశించారు. అదే విధంగా నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరావు, సర్పంచ్‌లు సాధు శ్రీదేవి, కొలుకులూరి ధర్మరాజు, ఎంఈఓ ఎ.రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

పెనుమంట్ర: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 తనిఖీల్లో భాగంగా గురువారం కేంద్ర బృందం మార్టేరు గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా కేంద్ర బృందం రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ (ఫీల్డ్) ఎం.మధుమతి పశ్చిమ గోదావరి జిల్లా కన్సల్టెంట్ ఎం.సంతోష్ కుమార్‌లతో స్థానిక అధికారులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కమ్యూనిటీ టాయిలెట్స్, గుణ్ణంచెరువు డ్రెయిన్లు, అవుట్‌లెట్లతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీలో పలు రికార్డులను తనిఖీ చేశారు.